క్లుప్తంగా

తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆధ్వర్యాన మనబ్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో మహిళలకు తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు తెలిపారు. జీకే ఓసీ, వీకేఓసీ ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతాల మహిళలకు స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇవ్వడమే కాక అవసరమైన పరికరాలు సైతం అందిస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న మహిళలు కొత్తగూడెం ఏరియా పర్సనల్ విభాగం కార్యాలయంలో ఈనెల 16 తేదీలోగా దరఖాస్తులు అందజేయాలి జీఎం సూచించారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ



రాఘబోయినగూడెంలో మొక్కలు అందజేస్తున్న సిబ్బంది

ఇల్లెందురూరల్: పచ్చదనం పెంపే లక్ష్యంగా వనమహోత్సవం నిర్వహిస్తుండగా మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామపంచాయతీ ఉద్యోగులు గురువారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యాన మొక్కలు నాటి సంరక్షించాలని అవగాహన కల్పించారు. మొక్కల పంపిణీని ఎంపీఓ చిరంజీవి పర్యవేక్షించారు.

మహిళలు, చిన్నారుల రక్షణకే షీ టీమ్స్



అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ఆపదలో ఉన్న మహిళలు, చిన్నారులకు రక్షణగా నిలిచేందుకు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని షీ టీం ఇన్‌స్పెక్టర్ రాములు తెలిపారు. కొత్తగూడెంలోని బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, పిల్లలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుమంటామన్నారు. ఈమేరకు 87126 82131, 1098 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. షీ టీమ్ ఎస్ఐ రమాదేవి, సిబ్బంది నాగయ్య, రాంబాబు, రాజు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణే కీలకం



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: మొక్కలు నాటడం కాకుండా వాటి సంరక్షణను బాధ్యతగా స్వీకరించాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని తోగ్గూడెంలో రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రీ గార్డుల ఏర్పాటు, సంరక్షణపై సూచనలు చేశారు. ఎంపీఓ చెన్నకేశవులు, ఏపీఓ పోరండ్ల రంగా, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో సమ్మె విజయవంతం

టేకులపల్లి: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైందని నాయకులు పేర్కొన్నారు. అందరి సహకారంతో సమ్మె విజయవంతమైందని వివిధ సంఘాల నాయకులు ముచ్చా సుధాకర్, డి.ప్రసాద్, అయిత శ్రీరాములు, వజ్జా సురేష్, గుగులోత్ రాంచందర్, ఈసం నరసింహారావు, కల్తి వెంకటేశ్వర్లు, నెల్లూరి నాగేశ్వర్‌రావు, హర్ష్య, సుందర్‌పాల్, రమేష్, కొండపల్లి చంద్రకళ, ఇందిర, పద్మ, మజహరి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని వారు వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

ఆర్టీసీలో 'మహిళా శక్తి'



ఇల్లెందు బస్టాండ్‌లో ఇందిరా మహిళా శక్తి బస్సు

పరుగులు తీస్తున్న ఇందిరమ్మ బస్సులు
- ఇల్లెందు డిపోకు తొమ్మిది బస్సుల కేటాయింపు
- మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ఊతం

ఇల్లెందు: మహిళా సమాఖ్యల్లో సభ్యుల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా పలు పథకాలను అమలుచేస్తోంది. ఇందులో భాగంగా ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా రుణంపై బస్సులను కేటాయించింది. గతంలో టెండర్ విధానంలో ప్రైవేట్ కాంట్రాక్టర్ల ద్వారా బస్సులు తీసుకోగా.. ప్రస్తుతం మహిళా సమాఖ్యలకు రుణాల ద్వారా బస్సులు కేటాయించి అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి ఇస్తున్నారు. తద్వారా వచ్చే అద్దెతో మహిళా సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించనున్నారు.

అన్ని బస్సులు ఇల్లెందుకే!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో తొమ్మిది అద్దె బస్సులను మహిళా సంఘాల ద్వారా సమకూర్చారు. ఇల్లెందు, టేకులపల్లి, చంద్రుగొండ, గుండాల, చర్ల, పాల్వంచ, ముల్కలపల్లి, బూర్గంపాడు, అశ్వాపురం మండల మహిళా సమాఖ్యల ద్వారా వీటిని అందించారు. ఈ బస్సులన్నింటినీ ఇల్లెందు డిపోకే కేటాయించగా.. వాటిపై 'ఆడబిడ్డల అభివృద్ధి తెలంగాణ ప్రగతి – ఇందిరా మహిళా శక్తి' పేరిట నినాదాలు రాయించడంతో ప్రయాణికులు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ఇల్లెందుకు డిపోకు కేటాయించిన బస్సులు ఇల్లెందు– కొత్తగూడెం, ఇల్లెందు – ఖమ్మం, ఇల్లెందు–గుండాల మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి.

నెలకు రూ.69వేల అద్దె

ఒక్కో బస్సు కొనుగోలుకు సంఘాల నుంచి రూ.6లక్షలు జమ చేయగా, రూ.3 లక్షల వడ్డీ లేని రుణాన్ని ప్రభుత్వం మంజూరు చేయించింది. ఈమేరకు గత మే నుంచి జూన్ వరకు ఒక నెలకుగాను రూ.69వేల చొప్పున రూ.6.25 లక్షలు అద్దె మహిళా సంఘాల ఖాతాల్లో జమ అయింది. ఇందులో నుంచి రుణ వాయిదా చెల్లించాక మిగతా నగదును సంఘ సభ్యుల్లో అవసరమైన వారికి రుణంగా అందిస్తారు. ఒక్కో బస్సుకు 84వాయిదాల్లో రుణ మొత్తం చెల్లించాక బస్సుల అద్దె పూర్తిగా మహిళా సంఘాలకే చెందనుంది. ఉచిత బస్సు ప్రయాణంతో బస్సుల కొరత ఏర్పడిన నేపథ్యాన మహిళా సంఘాల ద్వారా బస్సులు సమకూరుస్తుండడంతో ఇబ్బందులు తీరతాయని, ఇదే సమయాన సంఘాలు ఆర్థికంగా బలోపేతమవుతాయని చెబుతున్నారు.

మొదటి నెల అద్దె జమ..



బస్సులకు సంబంధించి ఒక నెల అద్దె రూ.69 వేల చొప్పున మహిళా సంఘాల ఖాతాల్లో జమ అయింది. బస్సు నిర్వహణ బాధ్యతలు ఆర్టీసీ చూసుకుంటుంది. ఈఎంఐల చెల్లింపు పూర్తయ్యాక ఆర్టీసీతో మరో ఏడేళ్ల పాటు అద్దె ఒప్పందం చేసుకోవాలి.

– దుర్గారావు, ఏపీఎం, ఇల్లెందు

యూరియా కొరత లేదు...



యూరియా రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ

సుజాతనగర్: మండలంలో సరిపడా యూరియా అందుబాటులో ఉన్నందున రైతులు ఆందోళనకు గురికావొద్దని కొత్తగూడెం ఏడీఏ ఉల్లోజు నర్సింహారావు సూచించారు. సుజాతనగర్‌లోని సొసైటీ గోదాంలో యూరియా నిల్వలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గోదాంలో 30మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అయితే, రైతులు దశల వారీగా అవసరం మేరకు కొనుగోలు చేయడంతో పాటు వాడకంలోనూ నియంత్రణ పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఓ జి.నర్మద, సొసైటీ ఉద్యోగి సైదులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల దందాను అరికట్టాలి



ఇల్లెందు : ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

వివిధ పార్టీల ఆధ్వర్యాన అధికారులకు వినతులు

కొత్తగూడెంటౌన్/ఇల్లెందు/ఇల్లెందు రూరల్: పల్లె, పట్నం తేడా లేకుండా బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అమ్ముతుండడంతో కుటుంబాలు చిద్రమవుతున్నామని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు కొత్తగూడెంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ గురువారం మాట్లాడుతూ వైన్స్‌షాపులు దక్కించుకున్న బినామీలు మద్యాన్ని బెల్ట్‌షాపులకు తరలించి అధిక ధరలతో అమ్ముతున్నారని ఆరోపించారు. ఈమేరకు షాప్‌లను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పంతుల్యా నాయక్, గోబ్రియా నాయక్, హరియా నాయక్, కుశనాయక్, జానకీరాంనాయక్, నీలవర్ణ నాయక్ పాల్గొన్నారు. అలాగే, బెల్ట్ షాప్‌లను నియంత్రించాలని కోరుతూ ఇల్లెందులో ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షులు భట్టు రమేష్, నాయకులు రాజేష్, శ్రీకాంత్, రాంచందర్, వీరన్న, ప్రవీణ్, బుచ్చన్న, క్రాంతి తదితరులు పాల్గొన్నారు. అంతేకాక విద్యాసంస్థల వద్ద బెల్ట్‌షాపులను నియంత్రించడమే కాక గుట్కాలు, గంజాయి అమ్మకుండా పర్యవేక్షించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఇల్లెందు, కొత్తగూడెంలో పోలీసులకు వినతిపత్రాలు సమర్పించారు. ఆయా సంఘాల నాయకులు వి.హరీష్‌గౌడ్, ఈర్ల రవి, అనిల్ యాదవ్, యాకేష్, ఇమ్రాన్, గణేష్, శివ, అన్వేష్, ఎస్.కే ఫహీమ్, ఖయ్యూం, ఉపేందర్, సురేష్, రణధీర్, బానోతు శ్రీనివాస్, వంశీ పాల్గొన్నారు.

మునగ సాగుతో అధిక లాభాలు

డీఆర్డీఓ విద్యాచందన



వినోభానగర్‌లో మునగ మొక్క నాటుతున్న విద్యాచందన

జూలూరుపాడు: మునగ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని డీఆర్డీఓ విద్యాచందన అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. వినోభానగర్‌లో చిలుకూరి కృష్ణయ్య అనే రైతు పొలంలో వనమహోత్సవంలో భాగంగా ఈజీఎస్, ఉద్యానవన అధికారులతో కలిసి మునగ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యధిక విస్తీర్ణంలో మునగ సాగయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. సూరారం, కొత్తూరు గ్రామాల్లో 'ఉపాధి' నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను పరిశీలించారు. వెంగన్నపాలెం, జూలూరుపాడు, పాపకొల్లు, భోజ్యాతండాల్లో నర్సరీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.కరుణాకర్ రెడ్డి, ఎంపీఓ తులసీరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు హరిబాబు, లక్ష్మణ్, సుమ, అశోక్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు కొత్తగూడెం వన్ టౌన్ సీఐ ఎం.కరుణాకర్ గురువారం తెలిపారు. మంగళవారం రాత్రి ఘటనా స్థలం నుంచి మృతదేహాన్ని జిల్లా సర్వజన ఆస్పత్రిలోని పోస్టుమార్టం రూమ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా,మృతుడి వివరాలు తెలిస్తే 87126 82017 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

ఎమ్మెల్సీ కవిత పరామర్శ



రాజేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

టేకులపల్లి: టేకులపల్లి మండలం మద్రాస్‌తండా పంచాయతీ మాజీ సర్పంచ్, తెంగాణ జాగృతి ఇల్లెందు నియోజకవర్గ అధ్యక్షుడు మాలోతు రాజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈమేరకు ఆయనను గురువారం ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కలవకుంట్ల కవిత పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబీకులతో కలిసి భోజనం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, నాయకులు చీమల సత్యనారాయణ, బర్మావత్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లలితా సహస్రనామ పారాయణం

టేకులపల్లి: మండల కేంద్రంలోని శ్రీజగదాంబ దేవి ఆలయంలో గురువారం మహిళలు లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారికి సారె సమర్పించారు.

నానో యూరియాతో లాభాలెన్నో..

టేకులపల్లి: పత్తి, మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు అధిక మోతాదులో యూరియా వాడొద్దని ఏడీఏ జి.లాల్‌చంద్, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్ సూచించారు. మండలంలోని బేతంపూడి సొసైటీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ అవసరం మేరకే యూరియా వాడడం ఫలితాలు ఉంటాయని తెలిపారు. అలాగే, తొలినాళ్లలో నానో యూరియా ఉపయోగిస్తే మంచిదని వివరించారు. కాగా, ఎక్కడా యూరియా కొరత లేనందున రైతులు ఆందోళనకు గురికావొద్దని సూచించారు. సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈఓ శ్రావణి, సొసైటీ డైరెక్టర్ ఉదయ్, సీఈఓ ప్రేమాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: భార్యను అదనపు కట్నం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన దేవికా కాలదిన్ పాసీకి ఆనంద్ లోథ్‌తో వివాహం జరగగా ఆయన మరో ఇద్దరితో కలిసి కొంత కాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. దీంతో దేవిక ఫిర్యాదు మేరకు ఆనంద్ సహా ముగ్గురిపై గురువారం కేసు నమోదుచేశామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

పాల్వంచరూరల్: వానాకాలంలో విద్యుత్ సంబంధిత ప్రమాదాలు పెరగనున్నందున రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఈ ఎస్.కృష్ణ, ఏడీఈ రహీముల్లా అవగాహన కల్పించారు. మండలంలోని పాండురంగాపురంలో గురువారం నిర్వహించిన పొలంబాటలో భాగంగా వారు మాట్లాడారు. పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లకు సొంతంగా మరమ్మతులు చేయకుండా సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

బాబా ఆలయాల్లో పూజలు, గురువులకు సన్మానం

గురుపౌర్ణమి సందర్భంగా కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల వద్ద భక్తులు బారులుదీరగా అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే, పాఠశాలల్లో గురు పూజోత్సవం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు గురువులను సత్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు : బాబాకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



కొత్తగూడెం టౌన్ : సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు



పాల్వంచ రూరల్ : గురువులను సత్కరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు



కొత్తగూడెం అర్బన్ : గురువులను సన్మానిస్తున్న నాయకులు



జూలూరుపాడు : సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎక్సలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు



పాల్వంచ : ఆలయంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు

తిలక్‌నగర్‌లో వైద్యశిబిరం



వైద్యరీక్షలు చేస్తున్న ఉద్యోగులు

ఇల్లెందురూరల్: మండలంలోని తిలక్‌నగర్‌లో ఓ వ్యక్తికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో గురువారం రొంపేడు పీహెచ్‌సీ ఉద్యోగులు వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే, ఇంటింటి సర్వే చేస్తూ దోమల నివారణ మందు స్ప్రే చేశారు. సీజనల్ వ్యాధులు దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి కవిత, ఉద్యోగులు రాజు, సత్యం, ఉమేష్, లాల్‌సింగ్, సునీత, సంత్రాలి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఉర్దూఘర్, షాదీఖానా



మాట్లాడుతున్న నయీమ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ఉర్దూఘర్, షాదీఖానాలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఉర్దూఘర్ అధ్యక్షుడు డాక్టర్ నయీమ్ ఖురేషి తెలిపారు. కొత్తగూడెంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉర్దూఘర్‌ను 2008లో నిర్మించినందున అవసరమైన మరమ్మతులపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లగా రూ.20 లక్షలు మంజూరు చేయించారన్నారు. తద్వారా అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులు చేయిస్తామని తెలిపారు. అలాగే, ఉర్దూఘర్ పైఅంతస్తు అప్పగింతపై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇక ప్యూన్ బస్తీలోని షాదీఖానాను వినియోగించుకోవచ్చని తెలిపారు. కాగా, కొత్తగూడెం ముర్రేడు వాగు వద్ద ఖబరస్తాన్ వద్ద సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కూనంనేని, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా చొరవతో మంజూరయ్యాయని నయీమ్ వెల్లడించారు. ఈసమావేశంలో ఎం.డీ.జుబేర్, మహమ్మద్ షరీఫ్, జావేద్ సాటి, ఎం.డీ.అమీర్ ఖాద్రీ, గౌస్, బాబ్జాని ఖాన్, జమాల్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జన్మదిన వేడుకలు



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇల్లెందు: గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ జన్మదిన వేడుకలను తమిళనాడులోని అరుణాచలంలో గురువారం నిర్వహించారు. అక్కడ ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో జే.కే.శ్రీను, ఎస్.రంగనాథ్, మహేందర్, శీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, దిండిగాల పుట్టిన రోజు సందర్భంగా ఇల్లెందులో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో పాలు, పండ్లు, సుభాష్‌నగర్ హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, నాయకులు సిలివేరు సత్యనారాయణ, ఎం.డీ.జాఫర్ హుస్సేన్, అబ్దుల్ నబీ, అజ్మీరా బాష్‌సింగ్, జబ్బార్, గిన్నారపు రాజేష్, సాతెల్ల హరికృష్ణ, కె.హరిప్రసాద్‌యాదవ్, కె.వీరస్వామి, కటకం పద్మావతి, తోట లలిత శారద, సందాబిందు, చీమల సుజాత, వి.తార, కిష్టయ్య, సందా ప్రవీణ్, మునిగంటి శివ, వంగా సునీల్, చాంద్‌పాషా, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం



చెక్కు అందజేస్తున్న డీఈ రంగస్వామి

టేకులపల్లి: మండలంలోని చుక్కాలబోడు గ్రామ పంచాయతీ కార్మికుడు భూక్యా వెంకటేష్ విద్యుదాఘాతంతో మృతి చెందగా రూ.5లక్షల పరిహారం మంజూరైంది. ఆయన రెండేళ్ల క్రితం ముత్యాలంపాడు క్రాస్‌లోని రైతువేదిక వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందగా, బాధిత కుటుంబీకులు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పరిహారం మంజూరు చేయించగా, చెక్కును గురువారం వెంకటేష్ కుటుంబీకులకు డీఈ రంగస్వామి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, సర్దార్, రాము, రమేష్, రవి పాల్గొన్నారు.

వైద్యం కోసం వచ్చి మృతి

సుజాతనగర్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన ఓ వ్యక్తి మృతి చెందాడు. జూలూరుపాడు మండలం కరివారిగూడెం కాలనీకి చెందిన కొటెం బిక్షం(35) జ్వరంతో బాధపడుతూ గురువారం సుజాతనగర్‌లోని ఓ ఆర్ఎంపీ వద్దకు వచ్చాడు. ఆ సమయాన వైద్యుడు లేకపోవడంతో రహదారి పక్కనే బల్లపై పడుకున్న ఆయన కింద పడి మృతి చెందాడు. కాగా, బిక్షం తల్లిదండ్రులు గతంలో మృతి చెందగా ఆయన ఒంటరిగా నివసిస్తున్నట్లు తెలిసింది.

మూడేళ్లు దాటితేనే బదిలీ!

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ కార్మికుల బదిలీ విషయంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. మునుపెన్నడూ లేని విధంగా మూడేళ్లు ఒకే ఏరియాలో పనిచేసి ఉంటేనే మరో ఏరియాకు బదిలీ చేయాలని ఇటీవల యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయగా, అమలుకు డైరెక్టర్(పా) గౌతం పొట్రు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే, ఈ విధానం అధికారులకు ఎందుకు అమలు చేయలేదనే ప్రశ్న కార్మికుల నుంచి వస్తోంది. ఇటీవల పర్సనల్ విభాగం అధికారులను బదిలీ చేయగా, ఒక అధికారిని బెల్లంపల్లికి బదిలీ చేసి వారంలోగా తిరిగి ఎడ్యుకేషన్ విభాగానికి కేటాయించారు. అంతేకాక గతంలో విజిలెన్స్ విభాగంలోనూ ఓ ఉద్యోగిని ఏడాదిలో నాలుగు ఏరియాలకు బదిలీ చేసి చివరికి కార్పొరేట్ విజిలెన్స్ విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు. అంతేకాక వివిధ ఏరియాల్లో ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న అధికారుల జాబితా రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా రెండు నెలలుగా విడుదల చేయకపోవడంలో ఆంతర్యమేంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

ముగ్గురు అధికారుల బదిలీ..

సింగరేణిలో ఎక్స్‌ప్లోరేషన్ విభాగంలో ఇద్దరు అధికారులతో పాటు ఐఈడీ విభాగంలో ఒక అధికారిని బదిలీ చేస్తూ యాజమాన్యం గురువారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్జీ –1 ఏరియా ఎస్ఈ కె.ప్రకాశ్‌రావును కార్పొరేట్ ఎక్స్‌ప్లోరేషన్ విభాగానికి, ఆర్జీ –1 ఎక్స్‌ప్లోరేషన్ విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్(జియాలజిస్ట్) ఎం.కరుణాకర్‌ను కార్పొరేట్‌కు, మందమర్రి ఏరియాలో ఐఈడీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్.ఎన్.ఫణికుమార్‌ను జీఎం(పీపీ) కార్పొరేట్‌కు బదిలీ చేశారు. వీరంతా ఈనెల 16లోగా విధుల్లో చేరాలని పేర్కొన్నారు.